

ఢిల్లీ దాకా పదవులు.. గల్లీలో దళితుల బతుకులు శూన్యం.

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -47 శనివారం18 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ధరణి అక్రమాలపై సిట్

- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినెట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం,
- పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు



**హైదరాబాద్,జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకుమిగతా 2లో...





# సరికొత్త శకం

## తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం

**జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది 2లో...



# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

## ఏపీకి వక్ఫ్ రికార్డులు అప్పగించిన తెలంగాణ

- పన్నెండేళ్ల తర్వాత తెలంగాణ నుంచి ఏపీకి చేరిన వక్ఫ్ రికార్డులు
- సుమారు 3,503 ఫైళ్లు, 4,050 సర్వే రిపోర్టులు స్వాధీనం
- ఇది చారిత్రక విజయమని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి
- తెలంగాణ నుంచి రూ. 55 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి



**హైదరాబాద్,జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఒక కీలక వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వేలాది వక్ఫ్ ఆస్తుల రికార్డులను తెలంగాణ వక్ఫ్ బోర్డు ఏపీకి అప్పగించింది. ఈ బదలాయింపుతో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.మిగతా 2లో...

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

**నరసరావుపేట, జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలుమిగతా 2లో...







# పెరుగుతున్న కరోనా..

- అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం
- దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు
- ఏపీలో ఇప్పటి వరకు 13కి పైగా కేసుల నమోదు
- ఇప్పటికే నలుగురు కోవిడ్ పేషెంట్ల మృతి


Damodar Raja Narasimha

# ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్

- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
- డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు..
- NEHS వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ వాటా..
- ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిధుల నిర్వహణ

**హైదరాబాద్,జూలై 17:**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మిగతా 2లో...




# బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

- శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్

**హైదరబాద్,జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు తెలంగాణ హైకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. ' జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో జరగబోయే యువ సంగ్రామ సదస్సును అడ్డుకొని, నిరుద్యోగ యువత గొంతు నొక్కుదామని ప్రయత్నించిన రేవంత్ రెడ్డి కుట్ర విఫలమయ్యింది. మిగతా 2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# సరికొత్త శకం

**మొదటిపేజీ తరువాయి**

కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది.
ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

**రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి**

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.
అదేవిధంగా అంబాలా-కాలా అంబ్, జింద్-గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్-గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ-బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

# పెరుగుతున్న కరోనా..

## అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, జూలై 17(జర్నలిస్ట్ వార్త);**
దేశంలో మరోసారి కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి 340కి పైగా కేసులు నమోదయ్యాయి. ఏపీలో కూడా కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. గడిచిన 20 రోజుల్లోనే రాష్ట్రంలో 13కి పైగా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో 3, విశాఖలో 1, కాకినాడలో 1 కేసు నమోదైంది. మహమ్మారి కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు. హోం ఐసోలేషన్‌లో మరో ముగ్గురు ఉన్నారు.
ఆసుపత్రిలో ఇద్దరు కోవిడ్ పేషెంట్లకు చికిత్స అందుతోంది. కృష్ణా జిల్లాకు చెందిన మరో మహిళ కరోనా బారిన పడగా ఆమెకు ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం కరోనా బారినపడిన పేషెంట్ల శాంపిల్స్‌ను పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. కేసులు ఎక్కువగా వస్తుండటంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులను అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, టెస్టులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. కరోనా కేసులపై నేడు మధ్యాహ్నం తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, గుంపులు కట్టకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరోనా నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి మొత్తం 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ వాల్యూమ్‌లతో పాటు ఇతర కీలక పత్రాలను ఏపీ వక్ఫ్ బోర్డు అధికారులు స్వీకరించారు. ఇదొక చారిత్రక మైలురాయి అని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన కీలక ఆధారాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.
2014లో రాష్ట్ర విభజన సమయంలో వక్ఫ్ చట్టం-1995 నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, నిధులు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ దశాబ్ద కాలానికి పైగా స్తంభించిపోయింది. కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆస్తుల యాజమాన్య హక్కులను నిర్ధారించడం, ఆక్రమణలను నిరోధించడం, న్యాయస్థానాల్లో కేసులను సమర్థవంతంగా వాదించడం ఏపీ వక్ఫ్ బోర్డుకు పెను సవాలుగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారంతో పాటు, తాము జరిపిన ఉన్నత స్థాయి చర్చలు ఫలించాయని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఈ రికార్డుల లభ్యతతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇదే క్రమంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీకి సుమారు రూ. 55 కోట్ల నిధులు రావాల్సి ఉందని, అవి కూడా త్వరలోనే విడుదలవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, ఈజేహెచ్ఎస్ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు.ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు.పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు ఈజేహెచ్ఎస్ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## సిద్ధిపేట్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్



**భీమదేవరపల్లి/జూలై17 (జర్నలిస్ట్ వార్త):** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట్ జిల్లా కార్యదర్శిగా పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బోయినిపెల్లి ప్రవీణ్ రావు, గుర్రాల లక్ష్మారెడ్డి తదితర నాయకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)లో ప్రజా సేవను ప్రారంభించిన పృథ్వీరాజ్ గౌడ్, 2009లో భారతీయ జనతా పార్టీలో చేరారు. అప్పటి నుంచి గ్రామ స్థాయి కార్యకర్తగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం యువమోర్చా మండల అధ్యక్షుడు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువమోర్చా కార్యదర్శి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి, హనుమకొండ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు, భీమదేవరపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వంటి పలు బాధ్యతలు నిర్వహిస్తూ జిల్లా కార్యదర్శి స్థాయికి చేరుకుంది. భీమదేవరపల్లి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ధర్నాలు, నిరసనలు, సేవా కార్యక్రమాలకు నాయకత్వం వహించిన ఆయన, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తూ, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తానని పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ తెలిపారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

## రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం -సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు

**న్యూఢిల్లీ,జూలై 17(జర్నలిస్ట్ వార్త):**న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.
"మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారుదేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఆఅఅః) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్దిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు

# బీఆర్ఎస్ యువ సంగ్రామ సభకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే... గౌరవ హైకోర్టు ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, సదస్సుకు అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎన్ని అవరోధాలు సృష్టించినా... యువత తరపున బీఆర్ఎస్ పార్టీ గళం విప్పుతూనే ఉంటుంది. యువతీ యువకులారా.. తరలిరండి.. సరూర్‌నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ మోసాలను ఎండగడదాం. రేవంత్ సర్కార్ మెడలు వంచుదాం. హామీల అమలుకు జంగ్ సైరన్ పూరిద్దాం. ఛలో సరూర్‌నగర్ స్టేడియం. నేటి ఉదయం 10 గంటలకు' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నిక వేళ ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ముఖ్యంగా యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని విమర్శించింది. అందుకోసం జులై 18వ తేదీన సరూర్ నగర్ స్టేడియం వేదికగా యువ సంగ్రామ సదస్సు నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ సదస్సుకు హాజరుకావాలని యువతకు పిలుపునిచ్చింది. ఈ సదస్సు కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. అయితే దీనికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై శుక్రవారం కోర్టు విచారణ జరిపింది. వాంతి భద్రతల సమస్య తలెత్తుతుందంటూ నిఘా వర్గాల నుంచి నివేదిక అందిందని ప్రభుత్వం తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సదస్సు నిర్వహించే ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాట్లు లేవని తెలిపారు. దాంతో 17 రోజుల క్రితం ఈ సదస్సు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ విషయాలను ఆ పార్టీ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదంటూ ప్రశ్నించింది. దీంతో ఈ సదస్సు నిర్వహణకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు మంజూరు చేసింది.

# ధరణి అక్రమాలపై సిట్

**మొదటిపేజీ తరువాయి**

గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది.

# నకిలీ సేంద్రియ ఎరువుల విక్రయం.. ఒకరిపై కేసు

## 60 బస్తాల ఎరువులు స్వాధీనం చేసుకున్న వ్యవసాయ అధికారులు

**వర్ధన్నపేట/ జూలై 17(జర్నలిస్ట్ వార్త);**
నకిలీ సేంద్రియ ఎరువులను విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న ఒక వ్యక్తిపై వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. ఈ నెల 9వ తేదీ ఉదయం వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల వద్దకు ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చాడు. తాను 'రైతు మిత్ర సేంద్రియ సంస్థ ప్రతినిధినని పరిచయం చేసుకున్నాడు. తమ వద్ద తక్కువ ధరకే అధిక దిగుబడినిచ్చే వానపాముల ఎరువు (వర్మీ కంపోస్ట్) ఉందంటూ, రూ.750 విలువైన 40 కిలోల బస్తాను రూ.500లకే ఇస్తానని ఆశ చూపాడు. దీంతో ఆ ముగ్గురు రైతులు తలా 20 బస్తాల చొప్పున మొత్తం 60 బస్తాలు తీసుకునేందుకు అంగీకరించి, రూ.1500 ముందస్తుగా ఇచ్చారు.తీసుకొచ్చిన బస్తాలపై ముద్రించి ఉన్న వివరాలను గమనించిన రైతులు అనుమానంతో వెంటనే వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించారు. ఈ మేరకు మరుసటి రోజు (తేది: 10.07.2026) ఉదయం 6 గంటలకే వ్యవసాయ అధికారులు ల్యాబర్తి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సదరు విక్రేతకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, వ్యాపార లైసెన్స్ లేవని.. గుర్తింపు లేని నకిలీ ఉత్పత్తులను రైతులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వెంటనే సుమారు రూ.30,000 విలువైన 60 బస్తాల నకిలీ ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధర ఆశ చూపి రైతులను నమ్మించి మోసం చేసిన సదరు ఏజెంట్‌పై వ్యవసాయ అధికారుల ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శనివారం18 జులై 2026

# దేవునూరు, సోమదేవరపల్లిలో 95% ఓటరు నమోదు పూర్తి

### మిగిలిన వారు బీఎల్ఓలకు సహకరించాలి: జీపీఓ శంకర్



**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోజూలై 17 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, సోమదేవరపల్లి గ్రామాలు ముందంజలో నిలిచాయి. ఈ రెండు గ్రామాల్లో ఇప్పటికే 95 శాతం ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందని జీపీఓ శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాల నమోదు, ధృవీకరణ ప్రక్రియను వేగంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కొంతమంది ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో వారి నమోదు మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ బీఎల్ఓలకు సహకరించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వారు త్వరగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బీఎల్ఓలు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత

### ఇంటింటా సర్వేలో కాంగ్రెస్ నాయకుడు వీసం సురేందర్ రెడ్డి



**హసన్‌పర్తి, /జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు వీసం సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హసన్‌పర్తి 66వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటా ఓటరు ధృవీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి ఓటర్ల వివరాలను పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదు, ఫారమ్‌ల స్వీకరణ, మ్యాపింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్న వారు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జరిగే రాజు, పెద్దమ్మ సురేష్, సూపర్వైజర్ మేకల రమేష్, బీఎల్‌వోలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌లో బెల్ట్ షాపులు మళ్లీ బుసకొడుతున్నాయా?

### పంచాయతీ తీర్మానం ఒకవైపు.. రహస్య విక్రయాలపై నిఘా ఎక్కడ?

### ఎక్సైజ్‌పోలీసుల ప్రత్యేక తనిఖీలు కోరుతున్న గ్రామస్తులు




**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోజూలై 17 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ గ్రామాన్ని బెల్ట్ షాపుల రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసి, అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేయడంతో పలుచోట్ల బెల్ట్ షాపులు మూతపడ్డాయి. ఈ చర్యపై గ్రామస్తులు పాలకవర్గాన్ని అభినందించారు. అయితే, గ్రామంలో ఇప్పటికీ కొన్నిచోట్ల రహస్యంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గ్రామస్థుల వాదన ప్రకారం, బహిరంగ విక్రయాలు తగ్గినా కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా మద్యం సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖలు దృష్టి సారించి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. పంచాయతీ తీర్మానం అమలులో ఉన్నప్పటికీ, ఎక్సైజ్ శాఖ నుంచి ప్రత్యేక తనిఖీలు, పోలీసు శాఖ నుంచి నిరంతర నిఘా కనిపించడం లేదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. గ్రామస్థాయి నిర్ణయాలకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి మద్దతు ఉంటేనే అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టవచ్చని వారు పేర్కొంటున్నారు. మహిళా సంఘాలు, యువజన సంఘాలు, గ్రామపంచాయతీ, పోలీసు, ఎక్సైజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి, ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రహస్యంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాన్ని బెల్ట్ షాపుల రహితంగా తీర్చిదిద్దాలంటే తీర్మానాలు మాత్రమే కాదు... వాటి అమలుపై నిరంతర నిఘా, సమన్వయ చర్యలు కూడా అంతే అవసరమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# గాయపడిన టీడీపీ కార్యకర్తల పరామర్శ

### పార్టీ అండగా ఉంటుందని జ్యోత్స్నా భరోసా



**ఇల్లందు,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తలను పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, జాతీయ మహిళా నేత ప్రొఫెసర్ తిరునగరి జ్యోత్స్నా శుక్రవారం పరామర్శించారు. ఇల్లందు తొలి వార్డుకు చెందిన బాసాని నాగేశ్వరరావు ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన ఖమ్మం యువ నాయకుడు బైరు అప్పారావును కూడా పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తర్వాత ఖమ్మంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నాయకులు జ్యోత్స్నాకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కేతినేని హరీష్, వడ్డేం విజయ్, గుత్తా సీతయ్య, ఆర్.ఎం. వరలక్ష్మి, ముద్రగడ వంశీ, రమేష్ బాబు, నవీన్, చలసాని ఝాన్సీ, పోటు సరస్వతి, రాటకొండ పావని, చుండూరు రాజరాజేశ్వరి, కోనేరు రాణి, మందపల్లి రజిని, మేకల సత్యవతి, కామ అనిత, తాడిశెట్టి స్వాతి, రంగిశెట్టి మంగమ్మ, పెనుగొండ ఉపేందర్, వక్కంతుల వంశీ, కూచిపూడి జై, నాగండ్ల లక్ష్మణ్, గుండెపిన్ని నాగేశ్వరరావు, బోయిన వెంకన్న, కాసాని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమంలో బేగ్ అల్లిబాబుకు ఘన నివాళి



**తల్లాడ,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన బేగ్ అల్లిబాబు దశదిన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బేగ్ అల్లిబాబు సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆయన లేని లోటు కుటుంబానికే కాకుండా గ్రామానికీ తీరనిదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అందరూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి కిషోర్, బిల్లుపాడు సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి దంపతులు, గుండ్ల వెంకటేశ్వర్లు, కొత్త వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, రామకృష్ణాచారి, రామచంద్రపురం సర్పంచ్ తోట రామారావు, ప్రోటు శరత్, సామినేని రామప్పారావు, రమేష్, షేక్ జమాల్, నాగులు మీరా, రేగళ్ల శ్రీను తదితర కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొని బేగ్ అల్లిబాబుకు నివాళులర్పించారు.

# రాజయ్య సేవలు చిరస్మరణీయం




**హసన్‌పర్తి,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** భీమారం గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఆకుల రాజయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం భీమారంలోని హెచ్‌ఎంటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. సమాజం పట్ల ఆయన చూపిన నిబద్ధత, కుటుంబానికి అందించిన విలువలు ఆదర్శప్రాయమని పలువురు పేర్కొన్నారు. రాజయ్య ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఆకుల సారంగపాణి, ఆకుల అశోక్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు సోదరు రామకృష్ణ, గుంజ కుమార్, తెలంగాణ ఉద్యమకారుడు ఆకుల కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూర సారంగపాణి, బూర సురేందర్, బూర రామకృష్ణతో పాటు పలువురు పాల్గొని రాజయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు.

# నందనం సొసైటీకి రాష్ట్ర ఉత్తమ అవార్డు




**హసన్‌పర్తి,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సహకార రంగంలో ఆదర్శంగా నిలిచిన నందనం కర్షక సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) రాష్ట్ర ఉత్తమ సొసైటీ అవార్డును దక్కించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ అవార్డుకు ఎంపిక కావడం విశేషం.
హైదరాబాద్‌లో నిర్వహించిన 45వ ఫౌండేషన్ డే వేడుకల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, నాబార్డు సీఏజీఎం ఉదయ్‌భాస్కర్, ఆర్‌బీఐ జీఎం చేతుల మీదుగా మాజీ టీజీక్యాబ్, డీసీసీబీ చైర్మన్, ప్రస్తుత నందనం సొసైటీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, సొసైటీ సీఈవో కోతి సంపత్ రాష్ట్ర ఉత్తమ సొసైటీ అవార్డును అందుకున్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు సొసైటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపినందుకుగాను ఈ అవార్డుకు నందనం సొసైటీని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు అందుకోవడం పట్ల మార్నేని రవీందర్‌రావు ఆనందం వ్యక్తం చేస్తూ, రైతు సభ్యుల విశ్వాసం, పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషికి లభించిన గుర్తింపేనని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



**హసన్‌పర్తి, /జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజ్ ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. మృతుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, మాజీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, నాగారం సర్పంచ్ చందరాజు లావణ్యసంతోష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి అన్వర్ ఖాన్, సీనియర్ నాయకులు బండారి మొగిలి, కుక్కమూడి కుమార్, రావుల శ్రీకాంత్, తోట భాస్కర్, మేకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ టీఎస్ లక్ష్యం

### హెల్త్ కార్డులు, పీఆర్సీపై ప్రభుత్వం సానుకూలం: జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ టీఎస్ ముందుంటుందని ఆ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ కార్డులు, పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు అందేలా చర్యలు వేగవంతమయ్యాయని, పీఆర్సీ ప్రకటన దిశగా కూడా




ప్రభుత్వం సానుకూల సంకేతాలు ఇచ్చిందన్నారు. ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పీఆర్టీయూ టీఎస్ రాజీపడకుండా పోరాటం కొనసాగిస్తోందని, ప్రతి సమస్య పరిష్కారం వరకు సంఘం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి జాన్‌సింగ్, రాష్ట్ర సహాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, బండ రమేష్,




సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు మొహినుద్దీన్, మల్లికార్జున్, వినేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వాలు స్వీకరించారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ట పునాది..

### మునిపల్లెలో పూర్వ ప్రాథమిక విద్యకు శ్రీకారం

### ఎంఈవో ఏ. శ్రీనివాస్

**హసన్‌పర్తి,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** చిన్నారుల విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెడుతోందని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ అన్నారు. హసన్‌పర్తి మండలంలోని దేవన్నపేట కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీయూపీఎస్ మునిపల్లె పాఠశాలలో శుక్రవారం పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా చిన్నారుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి మేధో, సామాజిక, భావోద్వేగ వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య దోహదపడుతుందని తెలిపారు.



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేసి ప్రతి చిన్నారికి నాణ్యమైన పునాది విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న నాణ్యమైన విద్యా సౌకర్యాలను




తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్, ఉపాధ్యాయులు విష్ణుప్రియ, నాగపాప, కవిత, సుజిత, ఏఏపీసీ చైర్మన్, అంగన్‌వాడీ టీచర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# ఆసుపత్రి ఛాంబర్‌లో కుటుంబ కార్యక్రమం.. చర్చనీయాంశం

**మధిర/, జూలై 17 (జర్నలిస్ట్ వార్త):**



మధిర ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓ అధికారిక ఛాంబర్‌లో ఇటీవల కుటుంబ కార్యక్రమం నిర్వహించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం, ఆసుపత్రిలోని నర్సింగ్ సూపరింటెండెంట్ అధికారిక గదిలో ఆమె కుటుంబానికి చెందిన శ్రీమంతం కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొంటున్నారు. ఆ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందిలో కొందరు కూడా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ వ్యవహారంపై ప్రభుత్వ కార్యాలయాలను వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించడం సేవా నిబంధనలకు అనుగుణమేనా? విధి నిర్వహణపై ఎలాంటి ప్రభావం పడిందా? అనే అంశాలపై స్థానికంగా చర్చ సాగుతోంది.అయితే, ఈ ఘటనకు సంబంధించి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అలాగే సంబంధిత అధికారుల స్పందన కూడా అందుబాటులోకి రాలేదు.ప్రచారంలో ఉన్న అంశాలపై వాస్తవాలను సంబంధిత ఉన్నతాధికారులు పరిశీలించి, అవసరమైతే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత





**తల్లాడ/, జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని నిరుపేద కుటుంబాలకు తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పాస్టర్ కమ్మంపాటి ఇశ్రాయేలు ఆర్థిక సాయం అందించారు. గూడూరు గ్రామానికి చెందిన ఆధూరి యోనా, మరియమ్మ దంపతుల కుమార్తె బ్లెస్సి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో ఆమె చికిత్స కోసం రూ.2 వేల సహాయం అందజేశారు. అలాగే గొల్లగూడెం గ్రామానికి చెందిన తెల్లపుట్ట కృష్ణయ్య పక్షవాతంతో బాధపడుతుండటంతో ఆయన కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం చేశారు.ఈ సందర్భంగా పాస్టర్ ఇశ్రాయేలు మాట్లాడుతూ, మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో నిరుపేదలకు తమ వంతు చేయూత అందిస్తున్నామని తెలిపారు. సమాజంలోని ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు గుంటి బాబురావు, దేవ సహాయం, నిరీక్షణ రావు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' గడువు పొడిగింపును ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలి

### -కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య.

**బయ్యారం/,జులై 17.(జర్నలిస్ట్ వార్త)**



కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రక్రియ గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిందని,ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని బయ్యారం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది ఓటర్లు సర్ ప్రక్రియను పూర్తి చేసుకోలేకపోయారనే ఉద్దేశ్యంతో ప్రజల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని,ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని గడువు ముగిసేలోపు తమ సర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల ప్రజలను కంబాల ముసలయ్య కోరారు.

## బయ్యారం గ్రామపంచాయతీలో ఘనంగా ఫ్రైడే-డ్రైడే.

**బయ్యారం/,జులై 17.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మేజర్ గ్రామపంచాయతీలో శు క్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పరిశుభ్రత, పచ్చదనం,గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని సంకల్పించారు.ఈ సందర్భంగా కార్యదర్శి రాంబాబు,ఉప సర్పంచ్ ఉమా,వార్డు సభ్యులు కళింగ రెడ్డి,ఆశా వర్కర్స్, పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కొత్తపేట జిపిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రారంభం.



**బయ్యారం/,జులై 17.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలో 2వ వార్డులో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు,కాంగ్రెస్ నాయకులు కలిసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్షాకాలంలో బురద సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ సీసీ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యాకయ్య,గ్రంథాలయ చైర్మన్ గట్టు శ్రీనివాస్,గ్రామ సెక్రెటరీ రఘువీర్,బుర్ర శంకర్,రాంబాబు, సీక్యా,రామాచారి, సురేష్, ప్రవీణ్,మహేష్, విజయ్,సర్వయ్య, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం మహిళలకు స్టీల్ ప్లేట్లు

## మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో పంపిణీ.. మహిళా సంఘాల హర్షం





**ఎల్కతుర్తి,/జూలై 17( జర్నలిస్ట్ వార్త)**

ఎల్కతుర్తి మండలంలోని ఇంద్రనగర్, కేశాపూర్, దామెర తదితర గ్రామాల్లో పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ఇందిరా మహిళా సంఘాల సభ్యులకు స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంబాల రమేష్, గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్, ఉపసర్పంచ్ కోరె లావణ్య, గ్రామ కార్యదర్శి గబ్బేటి స్వామి, వార్డు సభ్యులు కడారి సుధాకర్, నక్క రాకేష్, కడారి విమల, ఇందిరా మహిళా సంఘం వీవో అధ్యక్షురాలు గొర్రె శ్రీలత, ఉపాధ్యక్షురాలు కడారి రాజేశ్వరి, సీఏ తాడూరి సుమలత, అంగన్‌వాడీ టీచర్ ఎడ్ల రజిత, ఆశా కార్యకర్త కడారి మాదేవి, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి రాజారాం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిట్టపల్లి స్వామి, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులపై గ్రామపంచాయతీ చెక్

## మద్యం అమ్మితే రూ.20 వేల జరిమానా.. పట్టిస్తే రూ.5 వేల నగదు బహుమతి





**ఎల్కతుర్తి,/ జూలై 17 (జర్నలిస్ట్ వార్త):**



అక్రమ మద్యం విక్రయాలపై గ్రామపంచాయతీలు ఉక్కుపాదం మోపుతున్నాయి. బెల్ట్‌షాపులను పూర్తిగా నిర్మూలించేందుకు ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీ సంచలన నిర్ణయం తీసుకుంది. గ్రామంలో మద్యం, పొగాకు ఉత్పత్తులు, ఇతర హానికర నిషేధిత వస్తువుల విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ శుక్రవారం గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అక్రమంగా మద్యం విక్రయించినట్లు తేలితే సంబంధిత వ్యక్తిపై రూ.20 వేల జరిమానా విధించాలని నిర్ణయించారు. అంతేకాకుండా, అక్రమ విక్రయాల సమాచారాన్ని అందించి వాటిని పట్టించడంలో సహకరించిన వారికి రూ.5 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రకటించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, యువత, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గబ్బేటి స్వామి, ఉపసర్పంచ్ కోరే లావణ్య, వార్డు సభ్యులు కడారి సుధాకర్, నక్క రాకేష్, కడారి విమేజా, అంగన్‌వాడీ టీచర్ ఎడ్ల రజిత, ఆశా కార్యకర్త కడారి మాధవి, గ్రామ వీవో అధ్యక్షురాలు గొర్రె శ్రీలత, సీఏ తాడూరి సుమలత, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కడారి రాజారాం, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు అంబాల రమేష్, కోరే ఐలుమల్లు, నక్క వనమ్మ, రజితతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### వల్భాపూర్‌లోనూ కఠిన నిర్ణయం

వల్భాపూర్ గ్రామపంచాయతీ కూడా ఇదే బాటలో నడిచింది. సర్పంచ్ పొన్నగంటి శ్వేత, ఉపసర్పంచ్ అంబాల అనిల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే రూ.10 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. గ్రామాల్లో మద్యం, పాన్‌మసాలా తదితర హానికర వస్తువుల విక్రయాలను అరికట్టేందుకు అన్ని గ్రామపంచాయతీలు ముందుకు రావాలని గ్రామ నాయకులు పిలుపునిచ్చారు.అయితే కేశపూర్, తిమ్మాపూర్, దామెర, గోపాల్‌పూర్, జీలుగుల, పెంచికల్‌పేట, దండేపల్లి వంటి పెద్ద గ్రామపంచాయతీలు ఇప్పటివరకు ఇలాంటి తీర్మానాలు చేయకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు కోసం అన్ని గ్రామాల్లోనూ ఇలాంటి చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన.

**బయ్యారం/,జులై 17.(జర్నలిస్ట్ వార్త)**





ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచిస్తూ శుక్రవారం బయ్యారం మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ సమన్వయంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయ చంద్ర,డిసిఓ ఎం.విజయకుమారి ముఖ్య అతిథులుగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి లభ్యత తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు పప్పుధాన్యాలు,కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.అనంతరం నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగార్జున సాగర్ బయ్యారం మండలంలోని చెరువులు,ఇతర నీటి వనరులలో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత,సాగునీటి పరిస్థితులను రైతులకు వివరించి,అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రైతులకు కందులు, పెసలు,నువ్వుల విత్తనాలను పంపిణీ చేశారు.అదనంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో కనీసం 5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీప,నీటిపారుదల శాఖ అధికారులు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# బయ్యారం మండలంలో శీలానికి వెల కట్టిన పెద్దమనుషులు..?

### -అవమానం భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం..!

**బయ్యారం/జులై 17(జర్నలిస్ట్ వార్త):**




ఏజెన్సీ గ్రామాల్లో మహిళల వ్యక్తిత్వాన్ని (శీలాన్ని) శంకించి, కుల పెద్దలు పంచాయతీ పెట్టి తప్పు అని నిర్ధారించి దానికి జరిమానా డబ్బు రూపంలో వెల కట్టే దురాచారాలు ఇంకా కొనసాగుతున్నాయి.అలాంటి సంఘటనే మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో చోటుచేసుకుంది. బయ్యారం మండలంలో ఓ ఏజెన్సీ గ్రామంలో ఓ పంచాయతీ పరిధిలో ఎస్టీ మహిళ భర్త గత కొన్ని నెలలు క్రితం ఆత్మహత్య చేసుకోవడంతో ఆ గ్రామంలోనే ఆ వితంతు మహిళ జీవనం సాగిస్తున్నట్లు సమాచారం.అదే గ్రామంలో సర్పంచ్ తమ్ముడితో గత కొంతకాలంగా అక్రమ సంబంధం నడుపుతున్న సమయంలో ఈ నెల 15 రాత్రి కొంతమంది వారిద్దరిని పట్టుకొన్నట్లు సమాచారం.ఈనెల 16న ఆ గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో బాధిత మహిళ శీలానికి 50 వేలు వెలకట్టే ప్రయత్నం జరిగినట్లు సమాచారం, శీలానికి వెలకట్టి పంచాయితీలో ఆమెకు 30 వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది.మిగతా 20 వేల రూపాయలు బాధితుడు సమకూర్చకపోవడంతో ఆ మహిళ పెద్ద మనుషుల నిర్ణయం వ్యతిరేకించి సర్పంచ్ తమ్ముడితోనే తన వైవాహిక జీవితం కొనసాగిస్తానని సదరు వ్యక్తి ఇంటి ముందట భీష్మించడంతో పాటు మహిళ తనకు తానే రాళ్లతో కొట్టుకొని గాయపరచుకొన్నట్లు సమాచారం.పంచాయతీ జరుగుతున్న సమయంలో కొంతమంది గ్రామ మహిళలు అక్రమ సంబంధాన్ని సహించలేక అ మహిళపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు సమాచారం.ఈ సంఘటన బాధిత మహిళను మానసికంగా,శారీరకంగా బాధించడంతో ఈనెల 16న సాయంత్రం తన ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మహిళను గ్రామస్తులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ లో ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.అ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.గ్రామ పంచాయతీలో సర్పంచ్ తమ్ముడికి అనుకూలంగా వ్యవహరించిన పెద్దమనుషులకు ఈ సంఘటనతో ఇబ్బంది పడే పరిస్థితులు నెలకొన్నాయని గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నట్లు సమాచారం.అక్రమ సంబంధం ఏర్పరచుకున్న సర్పంచ్ తమ్ముడికి భార్య ఇద్దరు పిల్లలు,బాధిత మహిళకు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలుస్తుంది.ఆసుపత్రిలో బాధిత మహిళ నుండి జిల్లా జడ్జి మరణ వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం.

జర్నలిస్ట్ వార్త TELTEL/2023/87607
శనివారం18 జులై 2026

# భాస్కర్ హత్యపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

**బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: ఎమ్మార్పీఎస్ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ,**







**వర్ధన్నపేట /జూలై 17 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్‌లో హత్యకు గురైన దళిత యువకుడు సినపల్లి భాస్కర్ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించి, వేగవంతమైన విచారణతో నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు.
భాస్కర్ స్వగ్రామమైన ఉప్పరపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ఎంఎస్‌పీ బృందం పర్యటించి బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించింది. అనంతరం వారు మాట్లాడుతూ, భాస్కర్ హత్య ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని కోరారు. భాస్కర్ వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేసి అసలు ఘటనను పక్కదారి పట్టించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. గ్రామస్తుల సమాచారం ప్రకారం భాస్కర్‌కు గ్రామంలో ఎలాంటి వివాదాల చరిత్ర లేదని పేర్కొన్నారు. ఇప్పటికే పోలీసులు ప్రధాన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన చర్యలను స్వాగతించిన నాయకులు, ఘటనలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధిత కుటుంబానికి అందాల్సిన అన్ని హక్కులు కల్పించడంతో పాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.
భాస్కర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ఎంఎస్‌పీ అండగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర నేత బిర్రు మహేందర్ మాదిగ , వేల్పుల సూరన్న మున్నూరు కాపు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బొర్రా బిక్షపతి మాదిగ ఎం ఎస్ పి రాష్ట్ర నేత పుట్ట రవన్న మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారావు శ్రీనివాస్ మాదిగ ఎం ఎస్ పి రాష్ట్ర నేత కందికట్ల విజయ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కట్ట రాజశేఖర్ మాదిగ ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ మాదిగ జర్నలిజం ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు కరుణాకర్ మాదిగ లాయర్ ఫెడరేషన్ జిల్లా నాయకులు సీనేపల్లి మధు మాదిగ మాదిగ ఎం.ఎస్.పి జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ధర్మయ్య మాదిగ ఎంఎస్పీ వర్ధన్నపేట మండల శాఖ అధ్యక్షులు ముత్యాల మల్లేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి శీనపల్లి రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు చాడ కర్ణాకర్ మాదిగ ఎం ఎస్ పి మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ గ్రామ వార్డ్ మెంబర్ సీనేపల్లి ఆటో సారయ్య మాదిగ సీనపల్లి శ్రీనివాస్ మాదిగ తదితరులు కుల పెద్దలు మహిళలు యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

**: బుర్ర శ్రీనివాస్ గౌడ్**



**భీమదేవరపల్లి/జూలై 17 (జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో శుక్రవారం మండల అధ్యక్షులు బుర్ర సమ్మయ్య గౌడ్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి మాచర్ల కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో బస్సు యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌను సాంబయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గీత కార్మికులకు రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. వృత్తిలో ప్రమాదాలకు గురైన కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నీరా, తాటి–ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు కాటమయ్య రక్షణ కవచం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గీతన్నల చైతన్య బస్సు యాత్ర ఆగస్టు 2న మహబూబాబాద్ (మానుకోట) లో ప్రారంభమై ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు భీమదేవరపల్లి మండల కేంద్రానికి చేరుకుని, అక్కడి నుంచి ఎల్కతుర్తి, హసన్‌పర్తి మీదుగా భూపాలపల్లి జిల్లాకు, ఆగస్టు 17న ధర్మసాగర్, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల్లో కొనసాగుతుందని వెల్లడించారు. గీత కార్మికులు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, గ్రామ సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# గూడు చెదిరింది.. గుండె పగిలింది!

**- నిరుపేద దళిత కుటుంబంలో ఆరిన ఆశల దీపం - వృద్ధ తల్లిదండ్రులు, చెల్లెళ్లకు దిక్కెవరు?**

**-భాస్కర్ హత్యతో కన్నీటి సంద్రమైన ఉప్పరపల్లి - నా బిడ్డ ఏం పాపం చేశాడయ్యా అంటూ కన్నతల్లి ఆక్రందన**

**వర్ధన్నపేట/జులై 17 (జర్నలిస్ట్ వార్త);**
అదొక నిరుపేద కుటుంబం. తెల్లవారితే కూలీ పనులకు వెళ్తేనే గానీ పొయ్యి వెలగని దుస్థితి. రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న ఆ వృద్ధ తల్లిదండ్రుల జీవితాల్లో ఉన్న ఒకే ఒక్క వెలుగు.. వాళ్ల కొడుకు సినపల్లి భాస్కర్. నాన్న. మన కష్టాలు తీరిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. హైదరాబాద్‌లో మంచి ప్రైవేట్ ఉద్యోగం సంపాదించాను. చెల్లెళ్ల పెళ్లిళ్లు ఘనంగా చేస్తా. మిమ్మల్ని మహారాజుల్లా చూసుకుంటా అని ఆ కొడుకు ధైర్యం చెబుతుంటే, ఆ కన్నవారు తమ పేదరికాన్ని మరిచిపోయారు. కొడుకే తమ సర్వస్వమనుకున్నారు. కానీ, అంతలోనే సామాజిక అంతరాల రూపంలో వచ్చిన ఒక ఉన్మాదం ఆ నిరుపేద గూటి దీపాన్ని శాశ్వతంగా ఆర్పేసింది. ప్రేమించిన పాపానికి ఆ యువకుడి నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. హైదరాబాద్‌లో ఇటీవల దారుణంగా హత్యకు గురైన భాస్కర్ స్వగ్రామం ఉప్పరపల్లిలో ఇప్పుడు ఎటు చూసినా కన్నీటి రోదనలే వినిపిస్తున్నాయి.

**కన్నపేగు కోత.. వర్ణనాతీతం**

నా కొడుకు ఎవరి జోలికి వెళ్లేవాడు కాదు నాయనా.. ఊర్లో ఎవరితోనైనా గొడవ పడ్డాడా అంటే ఒక్కరూ అవునని చెప్పరు. పొట్టకూటి కోసం టౌన్ వెళ్లి కష్టపడుతున్న నా బిడ్డను ఇంత దారుణంగా చంపేస్తారా? ఇప్పుడు మాకు దిక్కెవరయ్యా? అంటూ భాస్కర్ తల్లి గుండెలవిసేలా ఏడుస్తున్న తీరు ఉప్పరపల్లి గ్రామస్తులను సైతం కంటతడి పెట్టిస్తోంది.
గ్రామంలో తమ్ముడబోయిన రాజు కుమార్తెను భాస్కర్ ప్రాణంగా ప్రేమించాడు. అయితే, తమ కంటే తక్కువ స్థాయి వాడనే అహంకారంతో ఆ తండ్రి వీరి ప్రేమను అంగీకరించలేకపోయాడు. కుమార్తెకు బలవంతంగా పెళ్లి చేసినా, మనసు చంపుకోలేక ఆమె విడాకులు తీసుకోవడంతో.. ఆ కోపాన్ని, పగను రాజు యాదవ్ ఈ నిరుపేద బిడ్డపై పెంచుకున్నాడు. పక్కా ప్రణాళికతో భాస్కర్‌ను హతమార్చి కిరాతకానికి ఒడిగట్టాడు.

**చనిపోయిన వాడిపై బురదజల్లడమేనా న్యాయం?**

కన్న కొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి నిందితుల కుట్రలు మరో కోలుకోలేని దెబ్బ తీశాయి. నిందితుడు రాజు యాదవ్ తాను చేసిన ఘోర పాపాన్ని కప్పిపుచ్చుకోవడానికి, చనిపోయిన భాస్కర్ వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపిస్తూ దుష్ప్రచారం చేశాడు. భాస్కర్ ఊర్లో లేకపోయినా, తన చిన్న కుమార్తెను వేధిస్తున్నాడంటూ కట్టుకథలు అల్లాడు. కేవలం ఒక యువకుడి మరణాన్ని తప్పుగా చిత్రీకరించి కేసు నుంచి తప్పించుకోవాలనే కుట్ర ఇదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భాస్కర్ ఎప్పుడో గ్రామాన్ని వదిలి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడని, ఊరిలో అతనిపై ఒక్క చిన్న కేసు గానీ, గొడవల చరిత్ర గానీ లేదని గ్రామస్తులంతా ముక్తకంఠంతో చెప్తున్నారు.

**రోడ్డున పడ్డ బతుకులు..**

ఇంటిని నడిపించే ఏకైక ఆధారం, కుటుంబానికి వెన్నుముక లాంటి కొడుకు చనిపోవడంతో ఆ నిరుపేద కుటుంబం ఇప్పుడు పూర్తిగా రోడ్డున పడింది. ముసలి తల్లిదండ్రుల కన్నీరు తుడిచే నాథుడే కరువయ్యాడు. పోలీస్ శాఖ ఇప్పటికే స్పందించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినప్పటికీ, ఈ దారుణంలో పాలుపంచుకున్న నిందితుడి ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లను కూడా వెంటనే పోలీస్ రికార్డుల్లో చేర్చి అరెస్ట్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.
కోర్టుల చుట్టూ తిరిగే స్తోమత, శక్తి లేని ఈ నిరుపేద కుటుంబానికి ప్రత్యేక కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపి న్యాయం చేయాలని, ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆర్థికంగా సహాయం అందించి ఆదుకోవాలని ఊరి ప్రజలు ఆశిస్తున్నారు. నిష్పక్షపాత విచారణ జరిపి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చేసి ఆ వృద్ధ తల్లిదండ్రుల కన్నీళ్లు తుడవాలని ఉప్పరపల్లి గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు కోరుకుంటున్నారు.

# జిల్లా సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**వోసుకుల ప్రేమ్ రాజ్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక**
**ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం: ప్రేమ్ రాజ్**



**రేగొండ/జూలై17 (జర్నలిస్ట్ వార్త):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చౌహాన్ ఆధ్వర్యంలో జిల్లా సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రేగొండ మండలంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వోసుకుల ప్రేమ్ రాజ్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఉద్యోగులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో పలిమెల మండలం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రాజలింగం ఉపాధ్యక్షుడిగా, టేకుమట్ల మండలం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పసరగొండ మంజుల కార్యదర్శిగా, భూపాలపల్లి మండలం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సంతోషం పద్మ ఉప కార్యదర్శిగా, మహదేవ్‌పూర్ మండలం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కే. రాజన్న కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వోసుకుల ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యక్రమాల్లో ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు ఉద్యోగుల హక్కుల సాధన, బాధ్యతల సమర్థ నిర్వహణకు సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి హాజరైన సెర్ప్ ఉద్యోగులు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి, ఉద్యోగుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# ఢిల్లీ దాకా పదవులు..

# గల్లీలో దళితుల బతుకులు శూన్యం.

**- పదిహేడున్నర ఏళ్ల ఎమ్మెల్యేల పాలన.. దశాబ్దాల ఎంపీల ప్రాతినిధ్యం.. అయినా మారని రాత**

**- సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన అగ్రనేత కుమార్తె నేడు ఎంపీ.. అయినా ఉప్పరపల్లి వైపు కన్నెత్తి చూడని వైనం**

**- 'పెద్ద సార్లను ప్రశ్నిస్తే మాకేమొస్తుంది' అని భజనపరుల కళ్లు మూతల బతుకులు**

**- రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలకు పాలకుల తూట్లు..**

**నిలదీస్తున్న దళితవాసులు**

**వరంగల్/వర్ధన్నపేట, జూలై 17(జర్నలిస్ట్ వార్త):**
విశ్వవిజేత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే వర్ధన్నపేట ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారింది. దళితుడు ప్రజాప్రతినిధిగా ఉంటే ఆ నియోజకవర్గంలో తమ సామాజిక వర్గం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రక్షణ పొంది అభివృద్ధి చెందుతుందని అంబేద్కర్ ఆనాడు రాజ్యాంగంలో ఎన్నో ఆశయాలను పొందుపరిచారు. కానీ, సుమారు వర్ధన్నపేట నియోజకవర్గంలో గడిచిన పదిహేడున్నర సంవత్సరాలుగా దళిత పాలకులే ఏలుతున్నప్పటికీ, దశాబ్దాలుగా దళిత ఎంపీలే ఢిల్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ. ఆ ఆశయాలన్నీ నేడు నీరుగారిపోతున్నాయి. ఉప్పరపల్లి గ్రామంలో చిన్నపిల్లి భాస్కర్ అనే దళిత యువకుడు పరువు పేరిట దారుణంగా హత్యకు గురైతే. నియోజకవర్గాన్ని ఏలిన, ఏలుతున్న ఏ ఒక్క దళిత పాలకుడూ, ఎంపీలూ బాధితుల వైపు కన్నెత్తి చూడకపోవడం ఇక్కడి దళిత సమాజాన్ని తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురిచేస్తోంది. డబుల్ ఇంజన్ సర్కారు కీలక పదవుల్లో.. ఎంపీల దండు ఉన్నా మౌనమేనా?
గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన నాయకుడు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కారులో అత్యంత కీలకమైన పదవుల్లో కొనసాగుతున్నారు. దళితుల హక్కుల గురించి మాట్లాడే సదరు నాయకుడు. తన పాత నియోజకవర్గంలో ఒక నిరుపేద దళిత బిడ్డ అన్యాయంగా ప్రాణాలు కోల్పోతే కనీసం సానుభూతి ప్రకటించకపోవడం విస్మయం కలిగిస్తోంది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పది సంవత్సరాల పాటు వరుసగా అధికారంలో ఉండి, పదవులను అనుభవించిన మరో మాజీ ఎమ్మెల్యే కూడా ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నారు. ఆయన నియోజకవర్గంలోనే ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో తిరుగుతున్నప్పటికీ. సాటి దళిత బాధిత కుటుంబాన్ని పరామర్శించాలనే కనీస ఆలోచన చేయకపోవడం దళిత ఓటర్లను నివ్వెరపరుస్తోంది.

**ఎమ్మెల్యేలే కాదు.. ఎంపీలదీ అదే బాట**

ఇక ఎంపీల విషయానికొస్తే. వర్ధన్నపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన, వహిస్తున్న నేతల తీరు మరీ దారుణంగా ఉంది.
గత పన్నెండేళ్ల క్రితం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంపీగా ఉన్న నాయకుడు నేడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అత్యంత కీలక పదవిలో కొనసాగుతున్నారు.
బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అధికారంలో ఉన్నంత కాలం ఎంపీగా ఉన్న నాయకుడు: ఇప్పుడు ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి చక్రం తిప్పుతున్నారు.
నేడు అధికారంలో ఉన్న ప్రస్తుత ఎంపీ దేశంలోనే తన పేరు చెబితే తెలియని వారుండరు అనేంతగా, సుదీర్ఘ కాలం అత్యంత కీలకమైన రాజకీయం నడిపిస్తున్న ఒక అగ్రనేత కుమార్తె నేడు ఎంపీగా ఉన్నారు.
ఇంతమంది దేశం గర్వించే స్థాయి దళిత నేతలు, ఎంపీలు ఉన్న వర్ధన్నపేట నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధికి దూరంగానే ఉండిపోయింది. చెప్పుకోవడానికి తప్ప వీరు దళిత సమాజానికి చేసింది ఏమీ లేదని క్షేత్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రశ్నిస్తే మాకేమొస్తుంది?.. భజనపరుల కళ్లు మూతల రాజకీయం.**

నియోజకవర్గంలో దళితుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే. పెద్ద నాయకులను ప్రశ్నిస్తే మాకేమొస్తుంది. వారిపై ఎందుకు పగబడాలి అనుకుంటూ స్థానిక లీడర్లు, భజనపరులు కళ్ళు మూసుకుని కాలం గడిపేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. పదవుల కోసం పెద్ద నేతల చుట్టూ తిరుగుతూ భజన చేసే ఈ నాయకులకు. కళ్ల ముందే ఒక దళిత తమ్ముడి ప్రాణం బలైపోతే నోళ్లు పెగలడం లేదు.

**ఉనికి చాటుకోవాల్సిన సమయం వచ్చింది.**

ఇలా ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీ స్థాయి నేతలను చూసుకుంటే. దశాబ్దాలుగా దళిత నేతలే వర్ధన్నపేటను శాసిస్తున్నారు. క్షేత్రస్థాయిలో దళితుల బతుకులు మారలేదు సరేకదా, కనీసం ప్రాణాలకు రక్షణ కూడా కరువైంది. దళితుల ఓట్లతో గెలిచి, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ద్వారా పెద్ద పెద్ద పదవులను అనుభవిస్తూ. సాటి దళిత కుటుంబానికి ఆపద వస్తే ముఖం చాటేస్తున్న ఈ పాలకుల వైఖరిపై మేధావులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా దళితుల ఆత్మరక్షణ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి బాటలు వేయాలని, ఈ భజనపరులను పక్కనబెట్టి తమ ఉనికిని, ఆత్మగౌరవాన్ని చాటుకోవాలని వర్ధన్నపేట దళితవాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.